చేసుకో దీప్తీ! టెన్షన్ భరించలేక అప్పుడప్పుడూ సిగరెట్ కాలుస్తున్నాను. అలా చేసినప్పుడల్లా కాస్త రిలీఫ్‌గా ఉన్నట్లనిపిస్తోంది. అందుకే.. నన్ను అర్థం చేసుకో" అన్నాడు.

ఉదయం ఏదో బ్రేక్‌ఫాస్ట్ హడావిడిగా చేసి వెళ్లిపోతాడు. మధ్యాహ్నం రోజూ భోజనం బయటే. ఏం తింటున్నావని ఈ మధ్య అడిగితే- పిజ్జా, బర్గర్, శాండ్‌విచ్ లేదా బిర్యానీ అంటున్నాడు. చికాకూ ఎక్కువయిందీమధ్య. బబ్లూని కూడా తరచుగా విసుక్కుంటున్నాడు. వాడి బాధ తను చూడలేకపోతోంది. కడుపులో, గొంతులో మంట అంటున్నాడు. బిపి ఎక్కువగా ఉందేమోనని తనకు అనుమానంగా ఉంది. ఈ వారమైనా జనరల్ చెకప్‌కి తీసుకెళ్లాలి. కుదురుతుందో, లేదో అనుకుంటూ ఉందామె.

దీప్తి పరిస్థితి కూడా అధ్వాన్నంగానే ఉంది. ఎంసెట్ డేట్ దగ్గర పడుతోందని, వాళ్ల ప్రిన్సిపల్ మీటింగ్ పెట్టాడు. ఈసారి తమ విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు పొందేందుకు ఏం చేయాలో సూచించమని, అందుకు ఆమెనే ఇన్‌చార్జి చేసి తనకు డైలీ రిపోర్ట్ ఇవ్వమన్నాడు. స్టూడెంట్స్‌కు ఒక ఆటవిడుపు లేదు. ఎప్పుడూ రుద్దుడు, రుబ్బుడు. పైగా లెక్చరర్ల నిరంతర నిఘా. ఈ అతి ఒత్తిడి తట్టుకోలేక కొంతమంది ఆత్మహత్యకు కూడా తెగబడ్డారు. వారి వైఫల్యాలలో తన బాధ్యత ఎంత? వారు కేవలం ర్యాంకులు సాధించే షో పీసెస్‌గా మార్చబడుతున్నారు. మంచి అభిరుచులు, వ్యాపకాలు లేవు. వ్యక్తిత్వ వికాసం పూర్తిగా శూన్యం.

ఈ కమర్షియల్ విషవలయంలో తానొక భాగస్వామిగా మారిపోయింది. విద్యా వ్యాపారాభివృద్ధికి తనవంతు చేయూతనిస్తోంది. విద్యాలయాలు వ్యాపార నిలయాలుగా మారిపోయాయి. ఇదేనా తాను నిజంగా చేయాలనుకుంది. టీచింగ్‌ను తానొక ఉన్నతమైన వృత్తిగా భావించి ఇందులోకి వచ్చింది. నిజంగా తాను వృత్తికి న్యాయం చేయగలుగుతోందా? తనకు తాను సంతోషంగా ఉందా? మరి దేనికోసం ఈ శ్రమ? ఇలా సాగుతున్నాయి ఆమె ఆలోచనలు.

ఒకరోజు రాత్రి పది గంటలకు ఇంటికి వచ్చాడు రాహుల్. అతను లోపలికి రాగానే బబ్లూ- "నాన్నా నువ్వు రోజుకు ఎంత సంపాదిస్తావ్?" అని ప్రశ్నించాడు.

అవాక్కయ్యాడు రాహుల్. "ఏరా, ఇది నువ్వు నన్ను అడగాల్సిన ప్రశ్నేనా?" కసురుకున్నాడు. అప్పటికి ఊరుకున్నాడు వాడు. ఆ మరుసటి రోజు రాత్రి పడుకోబోయే ముందు రాహుల్ పొట్టమీదకెక్కి కూర్చుని మళ్లీ అదే ప్రశ్న అడిగాడు. ఈసారి అతనికి కోపం రాలేదు. వాడి ముద్దు మొహంలోకి చూస్తే చాలా ప్రసన్నంగా అన్పించింది. సరే సమాధానం చెప్తే పోలా అనుకున్నాడు.

"రెండు వేల రూపాయలు" అన్నాడు రాహుల్.

"అయితే నాకు 500 రూపాయలు ఇస్తావా?" అడిగాడు వాడు. మళ్లీ నిర్ఘాంతపోయాడతను. కానీ అనునయంగా "నీకెందుకు నాన్నా అంత డబ్బు? ఏదైనా డ్రెస్ కావాలా? బొమ్మ కొనిపెట్టమంటావా?" అడిగాడు రాహుల్.

"అందుకు కాదు నాన్నా, నా దగ్గర 500 రూపాయలు ఉన్నాయి. నువ్వు ఇంకో 500 ఇస్తే, నువ్వు, నేను, అమ్మ 'స్ప్రైస్ ఇన్'లో డిన్నర్‌కి వెళ్లవచ్చు. మనం అలా వెళ్లి చాలా రోజులయ్యింది" అన్నాడు బబ్లూ.

ఈ సమాధానానికి రాహుల్‌కి ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియలేదు. కానీ కొద్దిసేపయ్యాక అతనికి క్లారిటీ వచ్చింది.

"రోజూ తొందరగా ఇంటికిరా నాన్నా. నాకు నీతో ఆడుకోవాలనుంది. నువ్వు కథలు చెప్పాలి కూడా" అన్నాడు బబ్లూ.

"అలాగేరా తప్పకుండా వస్తాను" అన్నాడు రాహుల్.

ఇది జరిగిన తర్వాత ఆ ఆదివారమే తీరిక చేసుకుని, ఆఫీస్‌లో పని ఉన్నా, అది వేరే వాళ్లకి అప్పగించి దీప్తి, బబ్లూలతో గడిపాడు. సినిమాకు వెళ్లారు. కాసేపు పార్కులో గడిపారు. రాత్రి భోజనం హోటల్‌లో చేశారు. దీప్తి, బబ్లూ చాలా ఆనందంగా కన్పించారు. తనకు కూడా ఏదో కొత్త శక్తి వచ్చినట్లయింది.

ఆ రాత్రి బబ్లూ తొందరగా నిద్రపోయాడు. రాహుల్, దీప్తి మాటల్లో పడ్డారు.

"ఏదో ఒకటి చేయాలండి. మనకు, మన ఫ్యామిలీ కోసం రోజూ కొంత టైమ్ కేటాయించుకోవాలి" దృఢంగా అంది ఆమె.

"అలాగే తప్పకుండా చేయాలి. కానీ ఎలా?" ప్రశ్నించాడతను.

"ఈ ఎంసెట్ పూర్తవగానే నేను ఆ కార్పొరేట్ కాలేజీలో మానేస్తానండి. మన ఇంటికి దగ్గరలోనే సెయింట్ జాన్స్ అనే స్కూలు చెవిటి, మూగ పిల్లల కోసం నడుపుతున్నారు. అందులో పనిచేద్దామని నిర్ణయించుకున్నాను" అంది.

"అలాగే, నేను కూడా వేరే ఏదైనా ఒత్తిడి తక్కువగా ఉండే ఉద్యోగానికో, లేదా కన్సల్టెన్సీ ప్రారంభించడం గురించో మెల్లిగా ఆలోచిస్తాను" అన్నాడతను.

ఎన్నో రాత్రుల తర్వాత రాహుల్, దీప్తి ప్రశాంతంగా నిద్రపోయారు. ■

# పెండ్లిచూపులు

**-డా॥ బి.దామోదరరావు**

"హలో హలో" వినిపిస్తుందా సార్. కరీంనగర్ నుంచి మాట్లాడుతున్నా..."

"ఆ.. ఆ.. వినిపిస్తోంది. చెప్పండి" అవతల నుంచి సమాధానం.

"మీ అబ్బాయి పెళ్ళికి ఉన్నాట్టగా! మాట్రిమోనియల్‌లో చూశాను సార్. అవునా?"

"ఆ.. ఆ.. ఉన్నాడండి. మీ గోత్రం" సంప్రదాయం పలికింది.

"అయ్యా మా గోత్రం కాశ్యప. మరి మీ గోత్రం..?" ఆత్రుత. అబ్బాయి ఎన్నారై మరి.

"భేష్. పరవాలేదు. మా గోత్రం భరద్వాజ. గోత్రాలు ఒక్కటి కాలేదు."

"హమ్మయ్య, మీ అబ్బాయి ఎక్కడ జాబ్ చేస్తున్నాడండీ?" కరీంనగర్ పక్షి.

"మావాడు న్యూయార్క్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో. మరి మీ అమ్మాయి ఏం చదువుతోంది?" సంప్రదాయం.

"మొన్ననే ఎం.సి.ఎ. పూర్తయింది. ప్రస్తుతం ఎంబ్రాయిడరీలో డిప్లొమో చేస్తోందండీ"

"ఓహ్.. అలాగా. బీటెక్ అనుకున్నా. అయినా కంప్యూటర్ స్కిల్స్ ఉంటాయిగా. సర్దుకుపోతాంలెండి.'

"అన్నట్టు అమ్మాయి వయస్సు, ఎత్తు చెబుతారా?" సంప్రదాయం ఆధునిక ప్రశ్న.

"మా అమ్మాయి వయస్సు ఇరవై రెండండి. ఎత్తు అయిదడుగుల అయిదంగుళాలు. మరీ మీ..."

"తెలుసు మీరడుగుతారని. మా అబ్బాయి వయస్సు ముప్పయ్ ఏళ్ళు. ఎత్తు ఆరడుగులు. సరిపోతాయా?"

"అవును రావుగారూ, మీ అమ్మాయి నక్షత్రం చెప్పలేదు. పాదాలతో సహా చెప్పండి. మా శాస్త్రిగారు అసలే ఒప్పుకోరు" సంప్రదాయం.

"అమ్మాయి నక్షత్రం అనురాధ, రెండో పాదమండీ. మరి మీ అబ్బాయి వివరాలు..."

"తప్పకుండా. ఆశ్లేష, మొదటి పాదమండీ"

"ఆహా కుదురుతుందని మా శాస్త్రిగారు చెబుతున్నారు."

"మీ అమ్మాయి ఫొటో పంపిస్తే మావాడు చూస్తాడు. అమ్మాయి రంగు.. తెలుపా, చామన ఛాయా? చెప్పండి" అధికార స్వరం వినిపిస్తుంది.

"మా అమ్మాయి బాగుంటుందండి. తెలుపు. మీ అబ్బాయి..."

"మావాడు అచ్చం నాలాగే తెల్లగా ఉంటాడండీ. మరి మీ అమ్మాయి సన్నగానా, లేక లావా? ఆహాఁ ఎందుకంటే ముందే తెలుసుకుంటే ఇబ్బంది ఉండదు కదా.. అందుకని" సంప్రదాయం.

"సార్, అమ్మాయి సన్నగా ఉంటుంది. మరి మీ బాబు?" ఆసక్తిగా అడిగాడు కరీంనగర్ పక్షి.

"మావాడు కొద్దిగా బొద్దులెండి. పైగా అమెరికా కదా, బర్గర్లు, పిజ్జాలు తింటారు కదా. మొత్తంమీద అన్నీ బాగానే కుదిరాయి. మరి మీరు హైదరాబాద్ ఎప్పుడొస్తారు? ఈ మాసంలో మూఢాలు పోయి, మంచి రోజులొచ్చాయి."

"వస్తామండి. మరి మీకు శాఖ పట్టింపులు.. అవీ..." ఆగాడు కరీంనగర్ పక్షి.

"లేవండి. మరి మీరు నియోగులా? వైదికులా?" సంప్రదాయం.

"నియోగులమండి. అయితే వైదికుల ఇంటికి మా పెద్దమ్మాయినిచ్చామండి"

"సరే.. సరే. రాసుంటే తప్పుతుందా! అన్నట్టు మీరు కరీంనగర్ వాళ్ళు కదా! తెలంగాణాపై మీ అభిప్రాయం ఏమిటీ?"

'అమ్మో, రాజకీయాభిప్రాయాలు కూడ పెండ్లిండ్లలో చోటుచేసుకున్నాయా?" అనుకుంటూ, కరీంనగర్ పక్షి కంగారుపడుతూ... "ఎంతైనా ప్రాంతీయాభిమానం తప్పక ఉండాలి కదండీ..."

అంతే ఫోన్ కట్. ■